# ఇది, మానవ సమాజమేనా?

## [వ్యాసాల, ఉత్తరాల, సంపుటం]

డ్రయినేజీ కందకాల్లోకి దిగే కార్మిక వృత్తి ఇది!
ఆ కందకాల కార్మికుల్లో కొందరు అక్కడే కళ్ళుమూస్తారు!
చంద్రుళ్ళ మీదకీ, సూర్యుళ్ళ మీదకీ పోయే యంత్రాలు ఉన్నా, డ్రయినేజీని
శుద్ధి చేసేది పాకీ కార్మికుల చేతులే! ఇదీ, ఈ మానవ సమాజం!








రంగనాయకమ్మ

# విషయ సూచిక

ముందు మాట.... 4

1. ఇది, మానవ సమాజమేనా? ........................ 5
2. ఇప్పుడు జరగవల్సింది ఏమిటి? .................... 35
3. "నల్ల డబ్బు" అంటే; "అవినీతి" అంటే? ...... 38
4. నోట్ల రద్దుని ఎలా అర్థం చేసుకోవాలి? ......... 74
5. మరో ప్రపంచాన్ని రేపు చూస్తాం! .................. 77
★ ఊహా చిత్రం! .................. 80
6. ఈ అమ్మ, ఎవరి అమ్మ? ............................ 92
7. "కుల నిర్మూలన"కు మీ మార్గం చెప్పండి! .. 97
8. మతం, "శ్రమ దోపిడీ" నీడే! ........................ 100
9. మాతృభాష తర్వాతే పరాయి భాషలు! .......... 105
10. "అవార్డులు" అంటే, డబ్బు! "డబ్బు" అంటే శ్రమ! ............... 108
11. నేను సేద దీరాను! ....................................... 111
12. డ్రగ్స్ మత్తులో ప్రభుత్వం! ............................ 113
13. నేను సైన్సు మనిషినే! ................................... 116
14. ఎదటివాళ్ళు ప్రశ్నించగలిగితే? ....................... 117
15. "అదనపు విలువ" మాట కూడా చెప్పండి! ... 118
16. ఆలోచించడం, నేర్చుకుందామా? ................. 119
17. ఏనుగు దండలతో సన్మానాలు! .................... 133
18. "స్వామీ రామానంద" రాసిన 3 ఉత్తరాలు! .................... 137

*

# 1. ఇది, మానవ సమాజమేనా?

**మానవులు** వున్నది, "మానవ సమాజమే" అవుతుంది. అయితే, ఆ సమాజంలో వున్న తీరు తెన్నుల్ని చూస్తే, అడుగడుగునా "ఇది మానవ సమాజమేనా?" అనే ప్రశ్న రావలిసి వుంటుంది.

మొత్తం ప్రపంచంలో, బానిసల కాలం నించీ, ఈ నాడు అమలులో వున్న పెట్టుబడిదారీ సమాజ కాలంలో కూడా, వెయ్యి న్నూట పదహారు సమస్యలు వుంటూనే వున్నాయి! ఇతర దేశాల సంగతులన్నీ వదిలేసి, ఈ భారత దేశపు సంగతినే తీసుకుంటే, ఇక్కడ అన్ని రకాల్నీ మించిన సమస్యలు వున్నాయి.

'శరీర ఆరోగ్యాల్ని' నాశనం చేసేవి, 'రోగాలు'! 'సమాజపు ఆరోగ్యాల్ని' నాశనం చేసేవి 'సమస్యలు'! రోగాల్లో కొన్నిటిని నాశనం చెయ్యడం ఈ నాడు సాధ్యం కాక పోవచ్చు; లేదా, ఏ నాటికీ సాధ్యం కాక పోవచ్చు. కానీ, సమాజ సమస్యల పరిష్కారానికి ఆ ఇబ్బంది వుండదు. కొన్ని సమస్యల పరిష్కారాలు ఈ నాడు కూడా సాధ్యమే! కొన్ని సమస్యలకైతే, ఈ నాడు కాకపోతే రేపు! రేపటితో అంతా సాధ్యమే. పరిష్కరించుకునే దృష్టే వుంటే, ఈ నాడే, ఈ గంటలోనే పరిష్కరించుకోగల సమస్యలూ వున్నాయి.

ఈ మానవ సమాజంలో అక్కడక్కడా, నెలల ఆడ బిడ్డ మీద కూడా అత్యాచారాలూ హత్యలూ జరుగుతున్నాయి! ఒక ఆడ దాని దేహాన్ని, రెండు చిల్లర డబ్బులు పడేసి, వెయ్యి మంది మగ వాళ్ళు ఛిద్రం చేస్తారు. భూమిలో వందల అడుగున వున్న బొగ్గుని తవ్వే మానవులు, హఠాత్తుగా పై కప్పు కూలి మట్టి రాసి కింద అణిగి, ఒక్కసారిగా వంద మందిగా చేతుల్లో వున్న పనిముట్లతోనే కన్నుమూస్తారు. - ఈ క్రూర సమస్యలన్నిటికీ పరిష్కారాలు ఈ నాడే సాధ్యం అయినా, అవి ఈ నాడు జరగవు; రేపే!

పసి బిడ్డలపై అత్యాచారాల్ని పరిష్కరించాలంటే, ఆ నేరస్తుణ్ణి పట్టుకోవడం, వాడికి జైలూ, కోర్టూ, సాక్షులూ, తీర్పూ, ఉరిశిక్షా, వాటిల్లో ఏదీ జరగదు. ఆ నేరస్తుడు దొరికినా, ఆ నేరానికి సాక్షులు దొరకరు. పైగా, ఆ నేరస్తుడికి బెయిల్ దొరుకుతుంది! వాణ్ణి ఏ శిక్షా అణచదు. అటువంటి సమస్యలకు పరిష్కారాలు తక్షణం మొట్ట మొదట జరగాల్సినవే అయినా, ఏదీ జరగదు.

'సమస్య' అన్నప్పుడు, ఏ సమస్య అయినా బాధాకర విషయమే. "ఈ సమస్య అయితే ఫర్వాలేదు. ఇది మంచి సమస్యే" అనదగ్గ సమస్య ఏదీ వుండదు.

మనసు వుంటే, మార్గం వుంటుంది. కానీ, మానవులంతా, ఈ నాటికీ, మనసు లేని మానవులే! **సమాజంలో వున్న మొత్తం సమస్యల్లో, తక్షణం మొట్ట మొదట పరిష్కారం కావలిసిన క్రూర సమస్య ఒకటి వుంది.** అది వుందనీ, దాన్ని నాశనం చెయ్యాలనీ, నిన్నటి దాకా ఏ వర్గానికీ తోచలేదు; ఏ కులానికీ తోచలేదు. ఈ నాటికైనా అది, అస్పష్టమైన గ్రహింపే!

సమస్యల్లో, పేదరికానికి పరిష్కారం, ఈ దోపిడీ సమాజంలో సాధ్యమా? - సాధ్యం కాదు. ఈ సమాజాన్ని సమానత్వం వేపు మార్చుకోవడంతో మాత్రమే అది సాధ్యం. కానీ, మొట్ట మొదట పరిష్కరించుకోవలిసిన క్రూర సమస్య గురించి

# 2. ఇప్పుడు జరగవల్సింది ఏమిటి?

ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దుల్లో, మావోయిస్టు పార్టీ మీద, నిన్న, ప్రభుత్వం చేసిన హత్యా కాండ, శ్రామిక వర్గ గ్రహింపు వున్న వారికి గాఢమైన దుఃఖం కలిగిస్తుంది. 2008 లో, మావోయిస్టుల మీదకి ప్రభుత్వం పంపిన గ్రే-హౌండ్స్ పోలీసుల పతనం, ప్రభుత్వానికి ఓటమి కలిగించింది. ఈ రెండు ఘట్టాలు గానీ, అనేక సంవత్సరాల కాలంలో మధ్య మధ్య జరిగిన ఇవే రకపు సంఘటనలు కానీ, శత్రు వర్గాల పోరాటాల్లో జరిగిన సంఘటనలే! అయితే, ఈ పరస్పర వ్యతిరేక సంఘటనలు, ఒకే గాటిన కట్టదగ్గవి కావు. 'వర్గ పోరాటం'లో, ప్రజా యుద్ధ పంథా పట్ల మావోయిస్టు పార్టీకి వున్న అవగాహనా, ఆచరణా, ఎంత లోపభూయిష్టమైనవైనా, ఆ పార్టీ, ఆ ప్రాంత ఆదివాసీ ప్రజల ప్రయోజనాల కోసమే పోరాడుతున్నదనేది నిజం! ఆ పోరాటం మీదకి ప్రభుత్వం పంపిన గ్రే హౌండ్స్ పోలీసు సంస్థ, ఆదివాసీల నివాస ప్రాంతాల్ని గనుల కంపెనీలకు కట్టబెట్టే కార్యం కోసం దూసుకొచ్చిన ప్రభుత్వ సంస్థే. ఈ సంస్థలోని చిన్న స్థాయి పోలీసులందరూ శ్రామిక కుటుంబాలవారే. వారంతా, అధికారుల కింద అణిగి మణిగి జీత భత్యాల కోసం పని చేసేవారే గానీ, వారి వృత్తిలో వారికి స్వంత లాభాలేవీ వుండవు.

మావోయిస్టు పార్టీలో, కార్యకర్తలు గానీ, నాయకులు గానీ, జీత భత్యాలకో, ఎక్స్-గ్రేషియాలకో, ప్రమోషన్లకో, చేరిన వారు కారు! ఆదివాసీ ప్రయోజనాలే వారి ఉద్యమ లక్ష్యం!

అటువంటి ఉద్యమం ఎక్కడైనా బైల్దేరినా, ఎక్కడ జరుగుతోన్నా, అది దోపిడీ వర్గ ప్రభుత్వానికి శత్రువే!

దోపిడీ ప్రభుత్వాన్ని, ధ్వంసం చేయడమే తమ లక్ష్యంగా పెట్టుకున్న కమ్యూనిస్టు విప్లవకారులపై, ఆ ప్రభుత్వం ద్వారా జరిగే దాడి, ఎదురు దాడిగానూ జరగవచ్చు; బూటకపు దాడిగానూ జరగవచ్చు. ప్రభుత్వం చేసే దాడులు, తమ చట్టాలనే లక్ష్యపెట్టవు. చట్టాలు అలా వుంటాయి కాయితాల మీద! ప్రభుత్వ పోలీసుల ఆచరణ, తుపాకులతో చేయగల మార్గాల్లోనే సాగుతుంది. ప్రజల ప్రయోజనాల కోసం జరిగే వుద్యమాల్ని అణిచే పోలీసుల సంస్థ పేరే గ్రే-హౌండ్స్! వేట కుక్కలు! ఉద్యమాలపై, ఏ పోలీసు దాడులు జరిగినా, పౌర హక్కులూ - మానవ హక్కులూ వంటి హక్కుల సంఘాలు, కమ్యూనిస్టు వుద్యమాల గురించి కూడా "చట్టబద్ధత" పరిధిలోనే మాట్లాడతాయి. అవి చట్టాలకి లోబడి పని చేస్తాయి కాబట్టి.

# 3. "నల్ల డబ్బు" అంటే? "అవినీతి" అంటే?

పెద్ద నోట్ల రద్దు వార్త, అది వచ్చిన రాత్రి మా ఇంట్లో తెలీనే తెలీదు. ఇంట్లో వాళ్ళకి టీవీ దర్శనాలు అంతగా వుండవు. కనీసం, ఆ వార్తని ఫోనులో అయినా మాతో ఎవ్వరూ అనలేదు ఆ రాత్రి - తెల్లారిన తర్వాతే ఆ వార్తని పత్రికలు చెప్పాయి.

భారత దేశంలో, ఈ నాటి ముఖ్య వార్త, "పెద్ద నోట్ల రద్దు!" నల్ల నోట్లనీ, నకిలీ నోట్లనీ, టెర్రరిస్టు నోట్లనీ - ఈ నోట్ల చలామణీ లన్నిటినీ అడ్డుకోగలమని, ప్రభుత్వం వారి ధీమాతో, ఈ పెద్ద నోట్ల రద్దులు, బైల్దేరుతూ వుంటాయి!

"నోట్ల రద్దా? ఏడిసిందిలే" అనుకున్నాం. దోపిడీ ప్రభుత్వాలు ఏ కార్యక్రమం చేసినా, అందులో ఏదో ఎత్తుగడ వుంటుందనుకుంటామే కాబట్టి, ఇదీ అలాంటిదే అని అప్పుడే తెలుసు. ఇంట్లో వున్నవన్నీ చిల్లర నోట్లే. పెద్ద నోట్లని చిల్లర చేసే అవసరం అప్పుడే రాలేదు.

ఇంకా సరిగా తెల్లారకుండానే ఒక ఫోను! "ఏమిటిది? ఇది అవసరమా? మీకు తెలుస్తుందని చేస్తున్నాను" అని ఒక పాఠకురాలు.

"నాకు తెలిసేదేమిటి? మీకు మాత్రం తెలీదా? మార్క్సిస్టు ఆర్థిక శాస్త్రం అంతా 'కాపిటల్' లో చదివేశానంటారుగా? దోపిడీ రాజకీయాల వాళ్ళు ఎప్పుడూ ఏవేవో కొత్త ఎత్తులు ఎత్తుతూనే వుంటారని తెలీదా?" అన్నాను.

"అవును, ఇదీ అంతే అంటారా? ఇలా చేస్తే నల్ల డబ్బంతా బైటికి వస్తుందట! చాలా మంచిదట కదండీ?"

"అసలు, 'నల్ల డబ్బు' అంటే ఏమిటో తెలీదా? అయితే, చదివిందంతా మళ్ళీ చదవండి!" అని ఆపేశాను.

ఆ సాయంత్రం, శ్రామిక రేణమ్మ 4 పెద్ద నోట్లతో కంగారుగా వచ్చింది, మా సలహాల కోసం. 40 ఏళ్ళు దాటిన మనిషి. మూడు ఇళ్ళల్లో రెండు పూటలా వంట పనులు చేస్తూ నెలకి దాదాపు 8 వేల లోపు, కొంచెం ఇటూ అటూగా, తెచ్చుకుంటూ వుంటుంది. భర్తగారు లేడు. బతికినంత కాలం నిన్నటి దాకా ఏ పనీ లేకుండా పెళ్ళాం డబ్బుతో తాగి తాగి హఠాత్తుగా పోయాడు. ఆ తాగుబోతు పోయాక, ఈమెకి ఖర్చు తగ్గి, నెలకి కొంచెం పొదుపు చేసుకోగలుగుతోంది. బ్యాంకులో ఎకౌంటు పెట్టుకుని, అక్కడ డబ్బు దాచుకోమని సలహా ఇస్తే అలాగే చేసుకుంటోంది. చదువు లేదు. చదువు మీద ఎంతో కోరిక అని ప్రతీసారీ చెపుతుంది. చిన్నప్పటి కాలంలో, తండ్రి కూడా తాగుబోతే. పలక కొని ఇచ్చే వాళ్ళు లేరు. పైగా, చిన్నప్పుడే పెళ్ళి! ఆ నాటి నించీ మొగుడి తన్నులే! పాతికేళ్ళ కూతురు వుంది గానీ, అది కూడా మొగుడికి బంటే! ఆ కూతురూ, అల్లుడూ, వాడి ఉంపుడు కత్తె - ఆ ముగ్గురూ, రేణమ్మ డబ్బు నెల నెలా లాగడానికే చూస్తారు. ఈ పిచ్చిది, ఇంకా ఎక్కువ పనులు చెయ్యాలని తాపత్రయ పడుతూ వుంటుంది.

మొగుడు పోయాక, అతని రోగాలూ,

# 4.నోట్ల రద్దుని ఎలా అర్థం చేసుకోవాలి?

ప్రభుత్వానికి ఆదాయం, పన్నులే. కాబట్టి, పన్నుల్ని ఎగ్గొడితే, అది అవినీతి! 'లంచాలు' కూడా అవినీతే! పన్నుల్ని సవ్యంగా కట్టడం నీతి! పన్నులుగా అందే డబ్బు, తెల్ల డబ్బు! పన్నుల్లో కొంత భాగం అందకపోతే, ఆ అందని పన్నులు, నల్ల డబ్బు!

భారత ప్రభుత్వం, పెద్ద నోట్లని రద్దు చెయ్యడానికి 4 కారణాలు చెప్పింది. (1) నల్ల డబ్బునీ, (2) నకిలీ డబ్బునీ, (3) టెర్రరిస్టు డబ్బునీ, (4) అవినీతినీ - ఈ 4 అంశాల్నీ ధ్వంసం చేస్తామని! - కానీ, ఈ 4 అంశాల్లో ఒక్కటి కూడా నోట్ల రద్దు వల్ల జరగదని ప్రజలు గ్రహించాలి.

'నోట్ల రద్దు' గురించి, డబ్బు విష యాలు ఏ మాత్రమూ తెలియని సాధారణ ప్రజలూ, డబ్బు విషయాలన్నీ ఈ నాటికి బాగా తెలిసివున్న డబ్బు పండితులూ, ఎవరి వ్యాఖ్యానాలు వాళ్ళు చేస్తూనే వున్నారు. కానీ, ఆ పండితుల వ్యాఖ్యా నాలు, రద్దుకి వ్యతిరేకంగా కాదు. "రద్దు చాలా గొప్పది" అని కొందరూ, "ఫలానా జాగ్రత్తల తర్వాతే ఈ రద్దు చేసి వుండవలి సింది" అని కొందరూ, ముచ్చటైన మెచ్చు కోళ్ళూ, నాజూకైన విమర్శలూ, గుప్పిస్తు న్నారు. అయితే, ఈ డబ్బు శాస్త్ర పండి తుల్లో, అటు సమర్ధకులకూ, ఇటు వ్యతిరేకులకూ కూడా, అమలులో వున్న 'డబ్బు శాస్త్రం' మీద, మౌలికంగా పేచీ ఏమీ లేదు. అంటే, ఈ డబ్బు శాస్త్రం వివరించే **వడ్డీలూ - లాభాలూ - భూమి కౌళ్ళూ - పన్నులూ - జీతాలూ - నిరుద్యో గాలూ - భిక్షాటనలూ -** వంటి అంశాల మీద, ఏ ప్రశ్నలూ, ఏ వ్యతిరేకతలూ, లేవు. ఈ పండితుల దృష్టికీ, ఈ ప్రభుత్వం దృష్టికీ, అవన్నీ సహజాలు! సత్యాలు! - ఎటొచ్చీ వ్యాపారులు పన్నులు సవ్యంగా చెల్లించక పోవడమే, కొంత ఇబ్బంది!

'డబ్బు శాస్త్రం' గురించి, ఈ నాటి ఆర్థికవేత్తలు కూడా ఆ చట్రంలోనే, ఆ గొంగట్లోనే, ముడుచుకుపోయి కూర్చుని, 'లాభాల' ఆర్థిక విధానానికే అక్కడక్కడా మెరుగులు దిద్దుతూ, ముస్తాబులతో సంస్కరణలు సూచిస్తూ, చివరికి నోబెల్ బహుమతులు కూడా పొందుతూ వుంటారు. ఈ నాడు అమలులో వున్న ఆర్థిక విధానం, శ్రామిక జనాభా చేసే శ్రమల నించి, అత్యధిక భాగాన్ని "లాభం" పేరుతో లాగే పెట్టుబడిదారీ విధానం - అని డబ్బు వేత్త లందరికీ, రాజకీయ వేత్తలందరికీ కూడా తెలుసు, ఆ దోపిడీకి గురి అయ్యే బికారి శ్రామిక జనాభాకి తప్ప! తెలిసిన వేత్తలం దరి ప్రధాన లక్ష్యం, లాభదారీ ఆర్థిక విధా నాన్ని స్థిరంగా, చెక్కుచెదర నివ్వ కుండా నిలబెడుతూ, అక్కడక్కడా సవరణల మాటలు గుప్పిస్తూ, ప్రజల్ని భ్రమల్లో ముంచడమే! అంతే గానీ, వేత్తల లక్ష్యం, ఏ సమస్యనీ నిర్మూలించడం కాదు.

ఒక లెక్కకి, సరైన జవాబు పట్టుకోవా లంటే, అది రెండో రకం గానో, మూడో రకం గానో, వుండదు. 5 + 3 = ఎంత? - ఇది 8 అయితేనే అది సరైన జవాబు. తప్పు జవాబులు అయితే, అది 9 కావచ్చు; 11 కావచ్చు; 83 కావచ్చు; ఆ సంఖ్యకి అంతం వుండదు. అలాగే, ఒక సమస్యకి సరైన పరిష్కారం అయితే, ఒక్క రకంగానే వుంటుంది. తప్పు పరిష్కారాలైతే, ఎన్ని రకాలుగానైనా ఉండగలవు.

# 5. మరో ప్రపంచాన్ని రేపు చూస్తాం!

**"మీ మరో ప్రపంచం ఎక్కడ?"** అంటూ, దుగ్గరాజు శ్రీనివాసరావు గారు రాసిన వ్యాసం (ఆంధ్రజ్యోతి, జూలై 26) కొన్ని ప్రశ్నలు అడిగింది. ఆ ప్రశ్నలు, నక్సల్బరీ ఉద్యమకారుల్ని అడిగినవే అయినప్పటికీ, అవి ప్రధానంగా **"మార్క్సిజం"** గురించి అడిగిన ప్రశ్నలే అవుతాయి.

''మరో ప్రపంచం'' అంటే, దోపిడీ సంబంధాలు లేని, ఆధిపత్యాలు లేని, ఉత్తమ మానవ ప్రపంచం.

అటువంటి మంచి ప్రపంచం ఏర్పడితే, అది ''మాదే'' కాదు; ''మీదే'' కాదు; మొత్తం మానవులందరిదీ అవుతుంది. ఈ నాడు, స్వంత శ్రమలు లేకుండా ఇతరుల శ్రమల్ని దోస్తూ జీవించే దోపిడీదారులు వున్నారే, వాళ్ళందర్నీ మార్చి, ఆ మంచి ప్రపంచం, వాళ్ళందరిదీ కూడా అవుతుంది.

ఈ నాటి మానవ సమాజంలో ఏవేవో సమస్యలు వున్నాయని ఎంతో కొంత గ్రహించిన మానవులు, ఈ సమాజం మారాలని, ఎవరి విధానాలు వారు చెప్పి వుండవచ్చు. కానీ, ''మార్క్సిజం'' తప్ప, ఇతర విధానాలేవీ, సమాజంలో వున్న అసలు దుష్టత్వం గురించి చెప్పలేదు. మార్క్సిజం మాత్రమే ''శ్రమ దోపిడీ, వేల సంవత్సరాలుగా సాగుతూనే వుంది; సమస్త సమస్యలకూ మూలం అదే!'' అని గ్రహించిన, ఏకైక సిద్ధాంతం.

మార్క్సిజం మాత్రమే మానవ సమాజంలో వున్న ''మౌలిక దోషాన్ని'' గ్రహించింది కాబట్టి, ఆ సిద్ధాంతం, ఆ దోషాన్ని తీసివేసే మార్గం కూడా చెప్పగలిగింది.

''మంచి ప్రపంచానికి మార్గం మార్క్సిజమే'' అని గ్రహించిన ఏ మానవులైనా, సమాజం గురించి రేకెత్తే ఏ ప్రశ్నలకైనా జవాబు ఇవ్వగలరు.

**"మీ మరో ప్రపంచం ఎక్కడ?" అని అడిగిన వ్యాసకర్త ప్రశ్నలకు నా జవాబులు ఇవి:**

**(1)** ప్రశ్న: మరో ప్రపంచానికి నమూనా ఏదైనా వుందా?

**జవాబు:** నమూనా ఇంకా ఇప్పటికి లేదు. నమూనా కోసం, శ్రామిక వర్గ ప్రణాళిక ఏ నాడో సిద్ధమై వుంది. అదే 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక'. రష్యా-చైనాలు, నమూనాల కోసం ప్రారంభ ప్రయత్నాలు చేశాయి గానీ, ''శ్రమ దోపిడీ'' పట్లా, ''శత్రు వర్గాల'' పట్లా, వాటి గ్రహింపులు గాఢమైనవిగా లేక, ఆ దేశాలు, మంచి ప్రపంచానికి నమూనాలు కాలేక పోయాయి. అయితే, అక్కడి అపజయాలకు కారణాలేమిటో కాలక్రమంలో అక్కడా గ్రహిస్తారు, ఇక్కడా గ్రహిస్తారు, ప్రపంచం అంతటా గ్రహిస్తారు. ఆ గ్రహింపులు జరుగుతూనే వున్నాయి. ''మంచి'' కోసం జరిగే ప్రయత్నాల్లో అపజయాలు అదే విధంగా ఆగిపోవు. నమూనాలు కాలక్రమంలో ఏర్పడక పోవు.

**(2)** మరో ప్రపంచంలో కూడా ఏదో ఒక ప్రభుత్వం ఉండాల్సిందే కదా?

**జవాబు:** ''మరో ప్రపంచం'' అంటే, దాని అర్థం వేరు. ''ప్రభుత్వం'' ప్రసక్తి, మరో ప్రపంచానిది కాదు. ఈ నాటి దోపిడీ ప్రపంచం, మరో ప్రపంచంగా స్థిర పడే వరకూ సాగే పరివర్తనా దశలో, దానికి తగిన ప్రభుత్వం ఉంటుంది. అసలు, ప్రభుత్వం (స్టేట్) అనేది, దాని కోర్టులూ, జైళ్ళూ, చిత్రహింసలూ, మరణ శిక్షలూ, వంటి

# 7.“కుల నిర్మూలన”కు మీ మార్గం చెప్పండి!

పట్టా వెంకటేశ్వర్లు గారికి,

మీరు ‘ఈమెయిల్’లో పంపిన “కులం-బహుజన ప్రజాస్వామిక విప్లవ దశ” అన్న మీ వ్యాసం చదివాను. దాని మీద నా అభిప్రాయాలు అడిగారు.

మీరు ఆ వ్యాసంలో చాలా విషయాలు ప్రస్తావించారు: ఆర్యులు, చార్వాకులు, బౌద్ధ జైన ఉద్యమాలు, మగధ సామ్రాజ్యం, సింధు నాగరికత, పుష్య మిత్ర శృంగుడు, భక్తి ఉద్యమాలు, బ్రిటీషు సామ్రాజ్యవాదం, భూసమస్య, విప్లవ దశలు, రష్యా, చైనా - ఇలా చాలా విషయాలు ప్రస్తావిస్తూ పెద్ద సైజులో 14 పేజీలయ్యే వ్యాసం రాశారు. వాటన్నిటి గురించీ నేను రాయాలంటే, పాతిక పేజీల్ని మించే వ్యాసం రాయాల్సి వస్తుంది. ఈ విషయం మీద అంత టైము పెట్టడం నాకు వీలు కాదు. అందుకే కేవలం, “కుల నిర్మూలన” మీద ‘నవ తెలంగాణా’లో నేను రాసిన వ్యాసాన్ని ప్రస్తావిస్తూ మీరు చేసిన వ్యాఖ్యలకీ, వేసిన ప్రశ్నలకీ మాత్రమే, నేను జవాబు రాస్తున్నాను. ఇతర విషయాలు నేను ప్రస్తావించను.

**(1)** “...రంగనాయకమ్మ లాంటి వారికి కుల నిర్మూలన అనేది ఏ దశలో జరగాల్సిన పోరాటమో, ఆ దశ గురించి మాట్లాడకుండా, అలాగే ఆ దశలో అనుసరించాల్సిన రాజకీయ కార్యక్రమం గురించి మాట్లాడకుండా, ఈ విషయంలో తనకు తగినంత పరిచయం లేదనటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది” అన్నారు మీరు.

**నా జవాబు:** ‘నాకు తగినంత పరిచయం లేదు’ అన్నది కుల నిర్మూలన గురించో, దానికి సంబంధించిన రాజకీయ కార్యక్రమం గురించో, కాదు. నేను అన్న సందర్భం ఇదీ: “....ఈ దేశంలో ఈ నాడు భూస్వామ్య శ్రమ సంబంధాలే ప్రధానమా, పెట్టుబడిదారీ శ్రమ సంబంధాలు ప్రధానమా, ఏ రాష్ట్రంలో ఏది ప్రధానం, ఆంధ్రప్రదేశ్‌లో గానీ, తెలంగాణాలో గానీ ఏది ప్రధానం - ఈ పరిశోధనలతో నాకు తగినంత పరిచయం లేదు. ఆ పరిశోధనా, ఆ సర్వే, ప్రత్యేకమైన కార్యక్రమం. ఆ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా పెట్టుకున్న కమ్యూనిస్టు వ్యక్తులు గానీ, కమ్యూనిస్టు పార్టీలు గానీ, చేయగలరు. చేశారు కూడా. పార్టీలు దేని అవగాహనతో అవి వున్నాయి” - ఇదీ, అక్కడ నేను అన్నది. పైగా, నేను నా వ్యాసంలో అడిగింది, మార్క్సిజంతో ఏకీభవించకుండా, కుల నిర్మూలన గురించి మాట్లాడేవారు, కుల నిర్మూలన ఎలా సాధ్యమో చెప్పాలనీ, అదే తేలిక మార్గం అయితే “అలాగే చేసుకుందాం” - అనీనూ!

**(2)** “భారత దేశ స్వరూపాన్ని అంచనా వేసే దగ్గర, కమ్యూనిస్టు పార్టీలు, గ్రూపులు, ‘అర్ధ భూస్వామ్య - అర్ధ వలస దేశంగా’ భావిస్తున్నాయని రంగనాయకమ్మ గారు చెబుతున్నారు. మరి, ఈ అర్ధ భూస్వామ్య, అర్ధ వలస వ్యవస్థలో, వర్ణ, కులాలు, ఎక్కడ దాక్కున్నాయి? లేదా, అంతమై పోయాయా? ఈ గ్రూపులవారు

# 8. మతం, "శ్రమ దోపిడీ" నీడే!

"స్వేచ్ఛాలోచన" దశాబ్ది సంచికలో (2016 అక్టోబరు) సంపాదక వ్యాఖ్యలు కొన్ని, చాలా హేతు విరుద్ధంగానూ, వైరుధ్యపూరితంగానూ, వున్నాయి.

**1.** "ప్రపంచంలో ఏ రాజ్యాంగం లోనూ లేని విధంగా, మన రాజ్యాంగంలో, ఆర్టికల్ 51-ఎ(హెచ్) ఉంది. శాస్త్రీయ స్ఫృహను, మానవ వాదాన్ని, పరిశీలనా తత్వాన్ని, సంస్కరణను, పెంపొందించ మని ప్రతి భారతీయుని ఆదేశిస్తోందది. ఈ నాల్గింటిపై దృష్టి పెట్టి, పాలకులు ఆచరణలోకి తేగలిగితే, దేశంలో పెను మార్పులు జరిగి అభివృద్ధికి దోహదపడ తాయి" అన్నారు మీరు.

ఏ రాజ్యాంగంలోనూ లేని విధంగా భారత రాజ్యాంగంలో ఫలానా ఆర్టికల్, శాస్త్రీయ స్ఫృహా, మానవ వాదమూ - వంటి వాటిని పెంపొందించమని ఆదే శిస్తోంది - అంటోంది స్వేచ్ఛాలోచన. అయితే, అదే రాజ్యాంగం, మత స్వేచ్ఛల్ని కూడా భక్తుల హక్కులుగా ఇస్తోందని, స్వేచ్ఛాలోచన గుర్తించిందా?

"మతాల స్వేచ్ఛలు" అన్నప్పుడు, ఆ మనుషులు, ఆ విశ్వాసాల్ని తమ ఇళ్ళకే, తమ మనసులకే, పరిమితం చేసుకోరు. మత విశ్వాసాల్ని మనసుల్లో వుంచుకోవడం కూడా శాస్త్రీయ స్ఫృహ కాకపోయినా, ఆ స్వేచ్ఛ వుంటే వుండవచ్చు. కానీ, మత స్వేచ్ఛలు అంత వరకే పరిమితమై వుండి పోవు. వీధుల్లో భూమి నిండా డజన్ల-వందల గజాల స్థలాల్లో, ఎకరాల్లో, గుళ్ళు బైల్దేరతాయి! ఆ గుళ్ళని పెట్టిన వాళ్ళు, అక్కడ పూజార్లని పెట్టి, ఆ గుళ్ళని ఆదాయ మార్గాలుగా చేసుకుంటారు. రక రకాల మత సంస్థలు విరాజిల్లుతాయి. మత బాబాలూ, మత గురువులూ, మత స్వాములూ వంటి వాళ్ళు బైల్దేరి, దేవతల కథలు కల్పిస్తూ, ఎన్నెన్ని మోసాలకైనా ఆశ్రయాలుగా నిలుస్తారు!

శాస్త్రీయ స్ఫృహని పెంపొందించుకో మని చెప్పే రాజ్యాంగం, భూమి నిండా గుళ్ళ నిర్మాణాల స్వేచ్ఛల్నీ, మత సంస్థల స్వేచ్ఛల్నీ, మత బాబాల స్వేచ్ఛల్నీ కూడా ఇస్తోందంటే, ఈ వైరుధ్యాలకు అర్థం ఏమిటి? ఆ రాజ్యాంగం, కపట రాజ్యాంగం అని అర్థం! రాజ్యాంగానికి ఈ కపటత్వం ఎందుకు? ఈ రాజ్యాంగం, దోపిడీ ఆదాయాల్ని పొందే ప్రైవేటు ఆస్తి పరులు వేల సంవత్సరాల నాడే పెట్టుకున్న రాజ్యాంగం. ఈ రాజ్యాంగం, సమాజా న్నంతా పరిపాలిస్తున్నాననే పేరుతో, 'శాస్త్రీయ స్ఫృహ' అంటూ చెప్పే మాటలన్నీ పూర్తిగా కపటత్వాలే!

స్వేచ్ఛాలోచన, 4 అంశాల్ని చెప్పి, "పాలకులు, ఆ నాల్గింటిపై దృష్టి పెట్టి, వాటిని ఆచరణలోకి తేగలిగితే, దేశంలో పెను మార్పులు జరిగి అభివృద్ధికి దోహదపడతాయి" అన్నారు.

ఆ 4 అంశాల మీదా దృష్టి పెట్టవలి సింది ఎవరు? పాలకులా? - కపట నిర్ణయాలు చేసే పాలకులే, ఆ కపటత్వా లకు వ్యతిరేకంగా దృష్టి పెడతారా? పాలకుల ద్వారా పెను మార్పులకు మార్గం వుంటుందా? - స్వేచ్ఛాలోచన ఇలా ఆలోచిస్తోందంటే, దీనికి, 'ప్రభుత్వ యంత్రాంగం' అనేది, ఏ స్వభావంతో

# 9. మాతృభాష తర్వాతే పరాయి భాషలు!

తెలుగు పిల్లలకి చదువు నేర్పేది, తెలుగు లోనా, ఇంగ్లీషు లోనా - అనే చర్చకి ఏమైనా అర్థం వుందా? అసలు, "చదువు నేర్పడం" అంటే ఏమిటి? - మాట్లాడే భాషకే చదవడమూ, రాయడమూ, నేర్పడం! మాట్లాడే భాషలో చదువు ప్రారంభం కాకపోతే, అసలు "చదవడం" అంటే తెలిసేది ఏ విధంగా? మాట్లాడని, తెలియని భాషలో పలికించడం మొదలు పెట్టడమా "చదువు" అంటే?

ఒక భాషలో మాట్లాడే పిల్లలకి, ఆ మాట్లాడే మాటలకే 'రాత' చూపించడం తోనే చదువు నేర్పడం మొదలవ్వాలి. తెలుగు పిల్లల ఉదాహరణతోనే చెప్పు కుందాం. వాళ్ళు తెలుగు మాటలు చక చకా మాట్లాడగలరు. పలకలు పట్టుకుని కూర్చున్నారు. అప్పటికే వాళ్ళు తెలుగు అక్షరాల్ని చూసి వున్నారు. వాటి శబ్దాల్ని విని వున్నారు.

ఒక పలక మీద, "పలక" అని రాసి చూపించి, ఆ అక్షరాలు "అక్షర మాల"లో ఎక్కడెక్కడున్నాయో చూపించి, "ఇదేమిటో చదవండి" అంటే, వాళ్ళు కంగారు పడుతూ, "ప ల క" అని చదివేసి, అది చదవగలిగినందుకు చాలా ఆశ్చర్యపోతారు.

" 'పలక' అని మీరే రాయండి" అంటే, రాసేస్తారు. అది వాళ్ళకి తెలిసిన మాట! తెలిసిన శబ్దాలు! అది తొందరగా అలవాటై, ఆ మాటని చదివినందుకూ, రాసినందుకూ, వాళ్ళకి గతంలో ఎన్నడూ లేని స్పందన కలుగుతుంది.

అదే మాటని ఇంగ్లీషులో చదివించా లంటే, 'ఎస్-ఎల్-ఎ-టి-యి' అనే అక్షరాలు మొదట చదివించి, "స్లేట్" అని చెప్పాలి. ఆ శబ్దాలన్నీ ఎన్నడూ విననివి. ఎన్నడూ మాట్లాడనివి. ఆ అక్షరాలే నేర్పి, ఆ శబ్దాలే చదివిస్తే, అది చిన్న మాటే కాబట్టి, దాన్నీ చదువుతారూ, రాస్తారూ కూడా! అయినా, 'పలక' అని చదివినప్పుడూ, రాసినప్పుడూ, ఆ మనస్సుల్లో కలిగిన స్పందన, 'స్లేట్' అని చదివినా, రాసినా, కలగదు. 'కుక్క - పిల్లి' అనే మాటల్ని చదివినప్పుడూ, రాసినప్పుడూ, తెలుగు పిల్లలకి కలిగే చలనం, 'డాగ్ - కేట్' అని చదివినప్పుడూ, రాసినప్పుడూ, వుండదు.

కాకపోతే, ఇంటా బైటా ఇంగ్లీషు చదువు మీద వున్న మోజు అంత చిన్న పిల్లల్ని కూడా ఆవహిస్తుంది. పిల్లాడు రెండు ఇంగ్లీషు ముక్కలు చప్పున చదివితే, తల్లి వెంటనే ముద్దులు కురిపించి, చాక్లెట్ ఇస్తుంది. "వీడికి ఇంగ్లీషు భలే వచ్చేస్తోంది" అని చెప్పుకుంటారు. వాడు ఆ మాటలు సరిగా చదవలేకపోతే, చిర చిర లాడతారు. పెద్ద వాళ్ళ పొగడ్తల వల్లా, చిర చిరల వల్లా, పిల్లవాడికి ఆ ఇంగ్లీషు గురించి, "ఇదేదో గొప్పది గావును, నేను నేర్చుకోలేక పోతున్నాను" అని బాధ గానీ; దాన్ని చప్పున చదవ గలిగితే, "నేను, గొప్పదాన్ని చదువు తున్నాను" అనే గర్వం గానీ; ఆ సందర్భాల్ని బట్టి కలుగుతాయి.

అక్షరాలతో ఏర్పడే మాటల్ని చదవగలిగి నప్పుడూ, రాయగలిగినప్పుడూ, ఆనందం రావాలి; బాధో, గర్వమో కాదు.

కాస్త ఇంగ్లీషు ముక్కలు మాట్లాడ గలిగే ఇద్దరు పిల్లలు, ఎంత చిన్న పిల్లలైనా, ఇద్దరూ తెలుగు వాళ్ళే అయినా, ఇంగ్లీషు లోనే చెప్పుకుంటారు. అలాంటి పిల్లలు, బస్సులు ఎక్కితే, అక్కడ డ్రైవర్లకీ -

# 10. "అవార్డులు" అంటే, డబ్బు! "డబ్బు" అంటే, శ్రమ!

"ఆంధ్రజ్యోతి"లో (జూన్ 18, 'నవ్య' పేజీ) సి.నారాయణరెడ్డి గారి ఒక అమ్మాయి మాట్లాడిన మాటల్లో, నా గురించి ఒక పొరపాటు మాట వచ్చింది. ఆ సంఘటన గురించే ఈ వివరణ!

"సుశీలా నారాయణరెడ్డి" అవార్డుని నాకు ఇవ్వాలని ఒక సందర్భం వచ్చినప్పుడు, నేను, "ఆ అవార్డు 'సుశీల' పేరుతో మాత్రమే వుంటే తీసుకునేదాన్ని; భర్త పేరు కూడా కలిసి వుంది కాబట్టి తీసుకోను" అని అన్నానని, ఆ అమ్మాయి మాటల్లో వుంది.

కానీ, అలా ఎప్పుడూ జరగలేదు. "సుశీల" అని, ఒక్క పేరుతో వుంటే మాత్రం నేను అవార్డులు తీసుకుంటానా? నాకు 24 ఏళ్ళ వయసులో, మార్క్సిజం గురించి ఏ మాత్రమూ తెలియని కాలంలో, 'బలిపీఠానికి' సాహిత్య అకాడమీ అవార్డు వస్తే, అది తీసుకోవాలి కాబోలు - అని తీసుకున్నాను. ఆ తర్వాత 'మార్క్సిజం' ద్వారా శత్రు వర్గాలూ, దోపిడీ వర్గ సంస్కృతీ - వగైరా విషయాలన్నీ అర్ధమై, బలిపీఠానికి అవార్డు తీసుకున్నందుకే బాధపడి, ఆ పుస్తకంలోనే రీ ప్రింటు సమయంలో, నేను తెలియక చేసిన తప్పు గురించి రాసుకున్నాను.

ఆ తర్వాత పదేళ్ళ వరకూ నన్నెవరూ పలకరించలేదు. ఆ కాలంలో, "విషవృక్షం" అయింది. దాదాపు పాతికేళ్ళ కిందట, 'రసమయి రాము' గారు ఫోన్‌లో అడిగారు, నారాయణరెడ్డి గారి అవార్డు తీసుకోమని.

నేను చెప్పాను, "లేదండీ, నా అభిప్రాయాలు పూర్వం లాగ లేవు. ఈ అవార్డుల సంగతి తప్పు సంస్కృతే. మీరెందుకు ఇటువంటివి పట్టించుకుంటారు?" అన్నాను.

"కాదమ్మా! సినారెగారు మిమ్మల్ని అడగమన్నారు" అన్నారాయన.

"భార్యల పేర్లతో భర్తలు బహుమతులిచ్చినా, భర్తల పేర్లతో భార్యలు బహుమతులిచ్చినా, వాటిని అసలు నమ్మవలిసిన పనే లేదు" అని నేను అనగానే, "ఉంటానమ్మా" అంటూ ఆయన మాటలు ఆపేశారు.

ఆ తర్వాత, కొన్నాళ్ళకు వాసా ప్రభావతి గారు కూడా ఫోన్‌లో ఆ అవార్డు మాటే ఎత్తారు. ఆవిడితో నాకు ఎక్కువ పరిచయమే. 'గోరింటాకు' సినిమా కేసులో నాకు సహాయం చేసిన వ్యక్తి ఆవిడ.

"నారాయణరెడ్డి గారు మిమ్మల్ని అడగమన్నారమ్మా! 'నేను ఇస్తే ఆవిడ

# 11. నేను సేదదీరాను!

"**మా**తృక"లో (2017, ఫిబ్రవరి) "దంగల్ - అర్ధ సత్యాల, అసత్యాల సెంటిమెంట్" అని చూడగానే, దాన్ని చదవగానే, నాకు సేదదీరినట్టయి పోయింది. నాకు ఎంత ఆనందం అయిందో చెప్పలేను.

ఆ సినిమా నేను చూడలేదు. కానీ, చూసిన వాళ్ళు వచ్చి, నా పక్కన కూర్చుని చెపుతోంటే, వినలేక పోయాను. వినలేక పోయినా, చెప్పే వాళ్ళు, నాకు నచ్చజెప్పాలని ఇంకా చెప్తూ పోయారు. ఆ సినిమా పేరు "కుస్తీ" అన్నారు. ఇక చెప్పొద్దన్నాను. అయినా, వాళ్ళు ఉత్సాహాన్ని ఆపుకోలేక చెపుతూనే వున్నారు! మొత్తానికి అదేవిటో చూడకుండానే తెలిసింది.

దాన్ని చూడకపోయినా, దాని మీద, **"దండగ సినిమా దంగల్!"** అని పేరు పెట్టి, వెంటనే రాయాలని పించింది. రాస్తానన్నాను. "అయ్యయ్యో, రాయకు, ఆ సినిమా అందరికీ నచ్చుతోంది" అన్నారు.

"అందరికీ నచ్చితే నచ్చింది. నాకు నచ్చలేదు కదా? నా మాట నేను చెపుతాను" అన్నాను.

నిజంగా, వాళ్ళు నిరుత్సాహపడ్డారు.

నేను రాయాలనే అనుకుంటూ, "కుస్తీ" అనే మాటకి చీదర పడుతూ, వారం రోజుల దాకా వూరుకున్నాను.

ఫిబ్రవరి నెల 'మాతృక' వచ్చి పడి, అందులో, ఆ సినిమా మీద రాసి వున్నది చదవగానే, "అద్భుతం! దాన్ని అర్ధసత్యాలు అనీ, అసత్యాలు అనీ చెప్పేస్తే, ఇంకా ఎవరో రాసేదేమిటి? నేను రాసేదేమిటి?" అని ఎంత తేరుకున్నానో! పని తప్పింది! ఆ వున్న దాన్ని నాలుగు సార్లు చదివితే, ప్రతీ సారీ "అద్భుతం! అద్భుతం!" అనుకున్నాను. ఎందరికో చెప్పాను.

నే నసలు ఏం రాయాలనుకున్నానంటే, ఎక్కువేమీ కాదు. "కుస్తీ" అనే పేరేమిటి? ఎంత చీదర ప్రవర్తన అది! - అని మాత్రమే రాయాలనుకున్నాను.

'మల్లయుద్ధం' అంటే ఏమిటి? ఇద్దరు మనుషులు ఒకళ్ళని ఒకళ్ళు ఎత్తి కుదెయ్యడం! రెండు జంతువులు కుమ్ములాడుకున్నట్టు మనుషులు ఒకళ్ళని ఒకళ్ళు గుద్దుకుంటూ, తన్నుకుంటూ, బాదుకుంటూ, గాయపర్చుకుంటూ, దాన్నంతా 'ఆట' లాగ అనుకోవడమా! చూసేవాళ్ళు కూడా అది వినోద కార్యక్రమం అయినట్టు నోళ్ళు తెరుచుకుని ఆ 'కొట్లాట'ని చూడడమా! తీరా చూస్తే చివరికి, బాగా ఎత్తి కుదేసిన మనిషికి, అంటే బాదడంలో చాతుర్యాలు చూపిన మనిషికి, గెలుపు! బాదడంలో చాతుర్యం లేక, అది నీరసంగా చేసిన మనిషికి, ఓటమి! ఈ మనిషి సరిగా బాదలేకపోతే, ఆ మనిషే ఉత్తముడు! తెగ బాది, రెండో మనిషిని కూలదోసిన వాడు, ఉత్తముడు కాలేడు. నిజానికి పశువు!

పాత కాలంలో ఎప్పుడో, ఎదటి వాణ్ణి బాదడం ద్వారా తనని తను రక్షించుకోవలిసిన ఆత్మ రక్షణే అవసరం అయి వుండి వుండవచ్చు. అది, ఆ నాటి నిజమైన అవసరం! అదా, ఈ నాటి 'ఆట'! ఆ నాటి క్రూరత్వాలన్నీ ఈ నాడు ఆటలైతే, బానిసల రోజుల్లో, యజమానులు, ఇద్దరేసి బానిసలకు నరుక్కునే, చంపుకునే, గతి కల్పించేవారు. దాన్ని కూడా ఇవ్వాళ ఆటలుగా ఎందుకు చెయ్యరు? కోళ్ళ పందాలు, ఎద్దుల పందాలు, గొర్రెల పందాలు, గుర్రాల పందాలు - ఈ పందేలన్నిటిలోనూ,

# 12. డ్రగ్స్ మత్తులో ప్రభుత్వం!

మత్తులో వున్న వాళ్ళకి, వాళ్ళేం మాట్లాడుతున్నారో, ఏం చేష్టలు చేస్తున్నారో, తెలీదు. మత్తు, చిన్నదా పెద్దదా అని కాదు; ఎంతది అయితే అంత మాటలూ, అంత చేష్టలూ, సాగుతాయి.

ఈ మధ్య, వార్తా సమాచారం అంతా విసుగెత్తించేస్తోంది! పత్రికల్ని అయితే ఒకటి రెండు పెద్ద వార్తలు చూసి వాటిని పక్కన పడెయ్యొచ్చు. రేడియో అయితే, దాన్ని కూడా తేలిగ్గా తప్పించుకోవచ్చు. టీవీ లైతే, స్వయంగా చూడని వాళ్ళకి కూడా, వాటిని వదలని మేళం ఇంట్లో తిరుగుతూ వుంటే, వాళ్ళు వదలక చూసే ప్రతీ వార్తనీ మన దాకా సరఫరా చేస్తూ వుంటారు. కళ్ళయితే మూసుకుంటాం గానీ, చెవులేం మూసుకుంటాం?

టీవీలు లేని, పత్రికలు లేని, రేడియో ఫర్వాలేదు - అంత చిరాకెత్తించదు, అటువంటి వార్తా లోకం ఏదైనా వస్తే గానీ, ఉన్నట్టుండి వచ్చి పడే హఠాత్ వార్తలతో గందరగోళ పడకుండా వుండలేం.

డ్రగ్స్ అట! మత్తు అట! ఇవేవో గొప్ప వార్తలు వచ్చి పడ్డాయి. ఇదేం కొత్త? ఇన్నాళ్ళ నించీ మత్తుల మాట ఎరగమా? ఊళ్ళ నిండా కిక్కిరిసి వుండే చుట్టలూ, బీడీలూ, సిగరెట్లూ, సారాలూ, గుర్రప్పందాలూ, గుళ్ళూ గోపురాలూ, లాటరీలూ, జాతకాలూ, జ్యోతిష్యాలూ, ఇవన్నీ మత్తులు కావూ? మనసు మత్తులు వేరూ, శరీరాల మత్తులు వేరూనా? మనసులు, శరీరాల్లోవి కావా?

"మత్తు, మత్తు" అంటూ ఇప్పుడేదో సరికొత్త విషయం అయినట్టు డ్రగ్స్‌ని పట్టుకుందేమిటి ప్రభుత్వం? ఇది కాస్త ఖరీదైన, బరువైన మత్తు అయితే, డబ్బుతో బలిసి వున్న వాళ్ళ మత్తు అది. వాళ్ళందరూ చదువులూ సంధ్యలూ వుండే వాళ్ళే. వాళ్ళ పిల్లలు నాశనం అవుతారని వాళ్ళకి తెలీదా?

'డ్రగ్స్' పేరుతో పోరాటం మొదలు పెట్టిన ఈ ప్రభుత్వాలే కదా, ఊరూరా వందల, వేల, లక్షల తాగుడు దుకాణాలు నడుపుతున్నాయి?

ఎవరు ఏ వీధిలో, ఏ సందులో బతుకుతోన్న వాళ్ళయినా, ఆ కొంపల నించి బైటికి పది అడుగులు వేసి చూడండి! అక్కడ రోడ్డుకి ఇటూ అటూ కూడా కనపడతాయి, ప్రభుత్వ సారా దుకాణాలు! ఏ సిటీలో అయినా, ఆ దుకాణాల సంఖ్యని లెక్క కడితే, ఆ లెక్క వేలని దాటి పోకుండా వుంటుందా?

తాగుడులో వంద రకాలో, వెయ్యి రకాలో వుండొచ్చు; ఏ రకాన్ని తీసుకున్నా, అది మత్తు కాదా? ఆ మత్తుతో సర్వ నాశనం అయిపోయిన సంసారాల్లో హత్యలు, ఆత్మహత్యలు, పిచ్చెత్తిపోయే పిల్లలు, బిచ్చగాళ్ళుగా మారే పెద్దలు, వ్యభిచారాలే బ్రతుకుదెరువులై పోయే ఆడవాళ్ళు - ఎన్నెన్ని జరిగిపోతున్నాయి! - ఈ నాడు డ్రగ్స్ మీద వీరత్వం చూపే శాఖ ఏ ప్రభుత్వ శాఖో తెలుసా? ప్రజల్ని

# 13. నేను సైన్సు మనిషినే!

"రక్త పరీక్షల" విషయంలో నేను, పెళ్ళి సంబంధాల్ని, 2 రకాలుగా విభజించి చెప్పాను. **(1)** పెద్ద వాళ్ళు కుదిర్చే సంబంధాలూ, **(2)** యువతీ యువకులు తమ ఇష్టాలతో ఏర్పర్చుకునే సంబంధాలూ - అని!

నేను, ఎప్పుడూ సైన్సు మనిషినే. పెద్ద వాళ్ళు నిర్ణయించే పెళ్ళి సంబంధాల్లో కూడా సైన్సు విషయాలు చూడాలనేది నిజమే. ఆడ పిల్లలకి గానీ, మొగ పిల్లలకి గానీ, కుష్టు వ్యాధులో, సుఖ వ్యాధులో, వున్నాయని తెలిస్తే, పెద్ద వాళ్ళు కూడా ఆ సంబంధాల్ని ఒప్పుకోరు. అలాగే, ఇప్పుడు చెప్పే "రక్త పరీక్షల" విషయం కూడా పెద్ద వాళ్ళు పట్టించుకోవాలి. కానీ వాళ్ళు, ఆస్తీ-ఉద్యోగం వంటి విషయాలు నచ్చాయంటే, ఈ కొత్త రక్త పరీక్షలకి విలువ ఇవ్వరు. అయినా, "ఈ ప్రమాదాల్ని కూడా పెద్దలు దృష్టిలోకి తీసుకోవాలి" అనే అభిప్రాయం నాకు తప్పకుండా వుంటుంది. వాళ్ళు ఆస్తుల పిచ్చితో ఏడుస్తారు గానీ, ఇవన్నీ పట్టించుకుంటారా? - అనే దృష్టితో రాశాను. కానీ, ఇంకా వివరంగా రాయ వలిసింది.

కానీ, యువతీ యువకులు తమ అనురాగంతో నిర్ణయించుకునే సంబంధాలు వుంటాయే; వీటి గురించే, రక్త పరీక్షల ద్వారా చేసుకునే నిర్ణయాలు హాస్యాస్పదం - అన్నాను. ఆ మాటే ఇప్పుడు కూడా మళ్ళీ అంటాను. దీన్ని ఇక రాయ నక్కరలేదు. అప్పుడు చెప్పిందే ఇప్పుడు మళ్ళీ చెప్పాలి. మనం, ఒక విషయాన్ని చర్చించేటప్పుడు దాన్ని వైరుధ్యాలు లేని స్పష్టమైన పద్ధతితో చూడాలి. "ప్రేమ" అనే దానిలో లక్ష తప్పులూ, కోటి మోసాలూ, వుంటాయి. తల్లిదండ్రుల ప్రేమల్లోనే అలాంటి దగాలు వుంటాయి. అయినా, "ప్రేమ" అంటే, అలాంటి వాటి గురించి తీసుకోకూడదు. కపటత్వాలు లేని, నిర్మలమైన ప్రేమతో, కలిసి జీవించాలని నిర్ణయించుకున్న జంట గురించే చెప్పుకోవాలి. ఆ ఇద్దరికీ అంత ఇష్టం కలిగిన తర్వాత, ఆ రక్త పరీక్షలు సరిపోవని తేలితే, వాళ్ళు ఆ సంబంధాన్ని వదిలేస్తారా? వదిలెయ్యాలా? - అయితే, జబ్బుల మార్గాల్ని వదలకుండా పిల్లల్ని కనాలని చెప్పడం కాదు. పుట్టే పిల్లలకు, జబ్బులే నిజమైతే, పిల్లల్నే కనక్కరలేదు. భార్యాభర్తలుగా ఆ ఇద్దరే సంతోషంగా జీవిస్తారు. పుట్టి వున్న పిల్లల కోసం, తల్లిదండ్రులు ఎంతెంత ప్రేమలైనా, ఎంతెంత త్యాగాలైనా, చూపిస్తారు, చూపించాలి. కానీ, పుట్టని పిల్లల కోసం వాళ్ళకా బాధ్యత వుండదు. 'ప్రేమ' తెలియకపోతే ఇది అర్థం కాదు.

భాను గారు, "బలిపీఠం" నవల గురించి, వింత విషయాలు రాశారు.

"కులాంతర వివాహాలు విచ్ఛిన్నమవుతాయన్న సందేశాన్నిచ్చే బలిపీఠం నవలని రంగనాయకమ్మ గతంలో వ్రాసింది" అని నా గురించి రాశారు. ఆయనకి ఆ నవల, అంత బాగా అర్థం అయిందన్నమాట! ఆ

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/book/Idi+Manava+Samajamena](http://kinige.com/book/Idi+Manava+Samajamena)

* * *